క్లుప్తంగా

వైభవంగా మహా తైలాభిషేకం


శనేశ్వరస్వామి

వాల్మీకిపురం: వాల్మీకిపురం పడమర పొలిమేర ధర్మపథంలో వెలసిన శ్రీ కార్యసిద్ధి అభయాంజనేయ స్వామి సమూహ దేవాలయంలో శని వారం ప్రదోష శని త్రయోదశి సందర్భంగా శని మహాత్మునికి మహా తైలాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదోష కాలంలో త్రయోదశి రావడం చాలా విశేషమని, పుణ్యఫలమైన కాలంలో శని దోషం అనగా అష్టమ శని, అర్ధాష్ట, వక్ర శని, కంటకశని దోష నివారణ పూజల్లో పాల్గొనడం వలన విశేష ఫలం లభిస్తుందని అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారికి గాయాలు

మదనపల్లె: ద్విచక్రవాహనం ఢీకొని చిన్నారి తీవ్రంగా గాయపడిన సంఘటన శనివారం పట్టణంలోని వైఎస్సార్ కాలనీకి చెందిన బి.రమేష్,గిరిజమ్మ దంపతుల పెద్ద కుమార్తె బి.హిమవర్షిణి (4) ఇంటి ముందు ఆడుకుంటుండగా గుర్తు తెలియని యువకుడు ద్విచక్ర వాహనంలో వేగంగా వచ్చి చిన్నారిని ఢీకొన్నాడు. ప్రమాదంలో చిన్నారి హిమవర్షిణి తీవ్రంగా గాయపడగా కుటుంబసభ్యులు వెంటనే ఆటోలో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక వైద్యులు చికిత్సల అనంతరం చిన్నారి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టపాసుల దుకాణాలు తనిఖీ


దుకాణాలను పరిశీలిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : ప్రభుత్వ నిబంధనలకు లోబడి టపాసులు విక్రయించాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో టపాసుల దుకాణాలను సీఐ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ దుకాణాల వద్ద ఇసుక, నీరు తప్పనిసరిగా ఉంచుకోవాలని ఆదేశించారు. దుకాణదారులు సరైన జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారి మస్తాన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

60 లీటర్ల సారా స్వాధీనం


సారా బట్టీలు ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

పీలేరురూరల్ : మండలంలో 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. శనివారం అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ ఆదేశాల మేరకు మదనపల్లె టాస్క్ ఫోర్స్, ఇంటిలిజెన్స్ టీమ్ కలసి మండలంలోని తలపుల పంచాయతీ జంగంపల్లె అటవీ ప్రాంతంలో దాడులు నిర్వహించారు. సారా బట్టీలు ధ్వంసం చేసి 60 లీటర్లు సారా స్వాధీనం చేసుకుని 200 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు సీఐ వివరించారు. ఈ దాడిలో ఎస్‌ఐ లక్ష్మీనరసయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

హార్సిలీహిల్స్‌పై పటిష్ట భద్రత

- స్థలాలు ఆక్రమిస్తే కఠినచర్యలు
- ఆర్డీఓ ఎం ఎస్ మురళి

బి.కొత్తకోట: ఆహ్లాదం కోసం హార్సిలీహిల్స్ వచ్చే సందర్శకులకు పటిష్టత భద్రత కల్పించేలా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని హార్సిలీహిల్స్ టౌన్‌షిప్ కమిటీ చైర్మన్, మదనపల్లె ఆర్డీఓ ఎంఎస్.మురళి అన్నారు. శనివారం కొత్తకోట తహసీల్దార్ రఫీక్‌అహ్మద్, ఎస్‌ఐ రామమోహన్‌తో కలిసి కొండపై నెలకొన్న పరిస్థితులను క్షుణ్ణంగా ఆయన పరిశీలించారు. గాలిబండ, రోడ్లు, ఖాళీస్థలాలు, ప్రైవేట్ భవనాలను పరిశీలించారు. బి.కొత్తకోట నగర పంచాయతీ నుంచి 15 మంది పారిశుధ్య కార్మికులను రప్పించి పారిశుధ్య పనులు చేపట్టగా వాటిని పరిశీలించారు. సుదూర ప్రాంతాల నుంచి సందర్శకులు వస్తున్నారని, వారి భద్రత ముఖ్యమన్నారు. దీనికోసం కొండపై 16 చోట్ల సీసీ కెమరాలను ఏర్పాటు చేయాలని సూచించగా దీనికి సంబంధించిన చర్యలు చేపట్టామని ఎస్‌ఐ వివరించారు. పారిశుధ్య పనుల నిర్వహణలో రాజీ పడకుండా చర్యలు తీసుకుంటేనే సందర్శకులకు ఆహ్లాదకర పరిస్థితి ఉంటుందన్నారు. చెత్త చెదారం నిండిపోతే సందర్శకులు హార్సిలీహిల్స్‌పై అభిప్రాయం మారిపోతుందన్నారు. కార్లు, బైక్‌లు రోడ్లపై నిలపకుండా నోపార్కింగ్ బోర్డులు పెట్టాలని సూచించారు. ఓటర్ల కోసం ఏర్పాటు చేసిన 200వ పోలింగ్ కేంద్రం కొత్త భవనాన్ని ఆర్డీఓ తనిఖీ చేసి పరిశీలించారు. కాగా రైల్వే అతిథి గృహంలో గదుల నిర్వహణను పరిశీలించాలని వీఆర్‌ఓ నరేంద్రను ఆదేశించారు. అతిథిగృహాలను రైల్వేశాఖే వినియోగించుకోవాలని, అలా కాకుండా బయటి వ్యక్తులకు అద్దెకు ఇస్తున్నారా లేదా అన్నది నిర్ధారించాలని కోరారు.


హార్సిలీహిల్స్ గాలిబండపై పరిశీలన చేస్తున్న ఆర్డీఓ మురళి

టపాసుల దుకాణాల్లో నిబంధనలు పాటించాలి

మదనపల్లె : దీపావళి సందర్భంగా ఏర్పాటుచేసే టపాసుల దుకాణాలకు సంబంధించి నిబంధనలను పాటించాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి ఆదేశించారు. శనివారం పట్టణంలోని మిషన్ కాంపౌండ్‌లో ఏర్పాటుచేసిన టపాసుల దుకాణాలను సీఐ మహబూబ్‌బాషాతో కలిసి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనలు, ఫైర్ సేఫ్టీ మార్గదర్శకాల ప్రకారం పాటించారా లేదా అన్న విషయమై పరిశీలించారు. ప్రతి దుకాణానికి మధ్య మూడు మీటర్లు దూరంతో పాటుగా, నీటిడ్రమ్ములు, ఇసుక నింపిన బకెట్లు ఏర్పాటుపై దుకాణదారులను ప్రశ్నించారు. పండుగ సందర్భంగా టపాకాయలు అధికధరలకు విక్రయించకుండా, ధరలు అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కార్యక్రమంలో పోలీస్, ఫైర్ అధికారి పురుషోత్తమనాయుడు తదితరులు పాల్గొన్నారు.


దుకాణదారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి, సీఐ మహబూబ్‌బాషా

ప్రజల జీవితాల్లో వెలుగులు నిండాలి


ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: దీపావళి పండగ ప్రజలందరి జీవితాల్లో చీకట్లను పారద్రోలి వెలుగులు నింపాలని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆకాంక్షించారు. పీలేరు నియోజకవర్గ ప్రజలు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో పండగ జరుపుకోవాలని, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

దీపావళి శుభాకాంక్షలు


ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే నవాజ్‌బాషా దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. దీపావళి అంటేనే కాంతి–వెలుగు. ఈ దీపాల పండుగ చెడుపై ధర్మం సాధించిన విజయాన్ని సూచిస్తుందన్నారు. దీపావళి మన చుట్టూ ఉన్న ప్రజల జీవితాల్లో వెలుగులు, సంతోషం, శ్రేయస్సు, కొత్త ఆలోచనలు తేవాలని కోరారు. ప్రతి ఇంటా ఆనంద కాంతులు విరాజిల్లాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.

మాలమహానాడు సభ విజయవంతం చేయండి

వాల్మీకిపురం: మాలమహానాడు 25వ విజయోత్సవ మహాసభను విజయవంతం చేయాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు శివయ్య కోరారు. శనివారం స్థానికంగా ఏర్పాటు చేసిన మాలమహానాడు సమావేశంలో మహాసభకు సంబంధించిన కరపత్రాలను ఆ సంఘం నాయకులు కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేది ఆదివారం మదనపల్లి సిఎస్‌ఐ ఫంక్షన్ హాల్‌లో మాలమహానాడు 25వ విజయోత్సవ మహాసభ ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు పట్టణ, మండల, గ్రామస్థాయిల నుంచి పెద్ద సంఖ్యలో దళితులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి వీరభద్రయ్య, జిల్లా కార్యదర్శులు సుధాకర్, శ్రీనివాసులు, నాగన్న, దిలీప్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మాలమహానాడు నాయకులు

శాస్త్ర సాంకేతిక రంగాల్లో రాణించాలి

మదనపల్లె సిటీ: విద్యార్థులు శాస్త్ర,సాంకేతిక రంగాల్లో రాణించాలని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి అన్నారు. స్థానిక చిత్తూరురోడ్డులోని ఆదిత్య ఇంజనీరింగ్ కాలేజీలో శనివారం సీఎస్‌ఈ,ఈసీఈ విద్యార్థులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్ వంటి కంప్యూటర్ సైన్స్‌లో అభివృద్ధి చెందుతున్న రంగాల గురించి తెలియజేశారు. ప్రిన్సిపాల్ సతీష్, ట్రైనింగ్ ఆఫీసర్ మనోజ్‌కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

సజావుగా సాగుతున్న కృష్ణమ్మ

బి.కొత్తకోట: జిల్లాలోని హంద్రీనీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువలో కృష్ణా జలాలు సజావుగా సాగుతున్నాయి. గతనెలలో బి.కొత్తకోట మండలం శెట్టిపల్లె వద్ద అక్విడెక్టు అంచులో కాలువ కట్ట తెగిపోయిన విషయం తెలిసిందే. దీన్ని మరమ్మతు చేసేందుకు వారంరోజులకుపైగా పట్టింది. పనులు పూర్తి కావడంతో సత్యసాయిజిల్లా కదిరి సమీపంలోని చెర్లోపల్లె రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలు విడుదల చేయగా ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా ముందుకు సాగిపోతున్నాయి. ప్రవాహం శుక్రవారం బి.కొత్తకోటను దాటి వెళ్లింది. ఒకట్రెండు రోజుల్లో కృష్ణా జలాలు మదనపల్లె నియోజకవర్గంలోకి ప్రవేశించనున్నాయి. కాగా ప్రవాహానికి అడ్డంకులు కలగకుండా కాలువలో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు.


బి.కొత్తకోట వద్ద కాలువలో సాగుతున్న కృష్ణా జలాలు

మీ ఆదరణకు రుణపడి ఉంటాం

-ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



బి.కొత్తకోట: తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, ఎప్పటికి రుణపడి ఉంటామని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ శుక్రవారం పెద్దతిప్పసముద్రం, ములకలచెరువు మండలాల్లో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం అయ్యేందుకు కృషి చేసిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీల సామాజిక సాధికార తకు సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కృషి చే స్తున్నారన్నారు. ప్రభుత్వ పదవులు, సంక్షేమం ద్వారా ఆర్థిక ప్రయోజనం కలిగించారని అన్నారు. సామాజిక సాధికార సభకు ఈ వర్గాలు పెద్దసంఖ్యలో హాజరై తమ మద్దతు, సంఘీభావం తెలిపారన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చిందన్నారు. ఈ సభతో ఈ వర్గాలకు మరింత చేరువ అయ్యామన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలు, గ్రామాల అభివృద్ధికి, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి ఆహర్నిశలు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

కలికిరి: పట్టణ పరిధిలోని శ్రీనివాసా కళాశాలలో వైఎస్సార్ విద్యార్థి యూనియన్ ఆధ్వర్యంలో శనివారం స్వతంత్ర భారత మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా ఆజాద్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం ఏర్పాటు చేసి పూజలు చేసి నివాళి అర్పించారు. యూనియన్ నాయకుడు నరేష్ అన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఖాదర్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆజాద్ చిత్రపటం వద్ద విద్యార్థులు

పూల మార్కెట్లు కిటకిట


మదనపల్లెలోని బెంగళూరు పూల మార్కెట్‌లో కొనుగోలు దారుల రద్దీ

మదనపల్లె సిటీ: దీపావళి పండుగను పురస్కరించుకుని పూలమార్కెట్లు కిటకిటలాడాయి. మదనపల్లె పట్టణంలోని బెంగళూరు బస్టాండు, మున్సిపల్ కార్యాలయం, చిత్తూరు బస్టాండు, శ్రీకృష్ణదేవరాయ సర్కిల్, నీరుగట్టువారిపల్లె ప్రాంతాల్లో అరటి,మామిడి ఆకుల అమ్మకాలు ఊపందుకున్నాయి. బెంగళూరు బస్టాండులో పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో కిక్కిరిసింది. పూలు ధరలకు రెక్కలొచ్చాయి. మల్లెపూలు కిలో రూ.1000 పలికాయి. దీంతో పాటు బంతి, చామంతి,రోజా పూలు ధరలు రెట్టింతలయ్యాయి. పూలహారాలు మంచి డిమాండ్ ఏర్పడింది. దుకాణాల్లో పూజల కోసం బూడిదగుమ్మడికాయల అమ్మకాలు ఊపందుకున్నాయి. దీంతో పాటు మట్టి దీపాలు, ప్రమిదలతో పాటు క్యాండిల్స్ దీపాలు అమ్మకాలు జోరుగా సాగాయి.

సీనియర్ సిటిజెన్స్ అవార్డు గ్రహీతలకు సన్మానం



మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మిలను సన్మానిస్తున్న సీనియర్ సిటిజెన్స్ సభ్యులు

మదనపల్లె సిటీ: జిల్లాలో ఉత్తమ సీనియర్ సిటిజెన్స్ అవార్డు గ్రహీతలను శనివారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో ఘనంగా సన్మానించారు. డాక్టర్ రాజేష్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఎస్.మునిగోపాలకృష్ణ, ధనలక్ష్మి,జగన్‌మోహన్, శకుంతలమ్మలను సన్మానించారు. జిల్లా అధ్యక్షులు మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ సీనియర్ సిటిజెన్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘ ఆధ్వర్యంలో మరిన్ని సామాజిక కార్యక్రమాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉస్మాన్, కృష్ణమూర్తి, సరస్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.